సాక్షి ఆదిలాబాద్

ఆదివారం, 28, మే, 2023



కాలంతో పోటీ.. అర్లి(టి)

సీజనల్ స్పెషల్ గ్రామమిది. జిల్లాలోనే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం . ఆ ఊరే తాంసి మండలంలోని అర్లి(టి). 8లో▸



స్వశక్తితో ముందుకు..

ఎంచుకున్న రంగంలో ఇష్టంగా పనిచేస్తూ.. స్వయం సమృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నారు ఈ మహిళలు. వ్యాపారంలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారు భారత ప్రభుత్వం అందించే పద్మశ్రీ,, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన వారికి జనవరి 26, 2024లో ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం చేస్తారని తెలిపారు. జిల్లాకు చెందిన వారు కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్, టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, లిటరేచర్, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసులు తదితర అంశాలలో సాధించిన విజయాలపై 800 పదాలు మించకుండా ఈనెల 30లోపు https:// padmaawards. gov. in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న సమాచారాన్ని జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 9440843848 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మెడికోల స్టైఫండ్ పెంపు

ఆదిలాబాద్‌టౌన్: వైద్య విద్యార్థులకు అందించే స్టైఫండ్‌ను 15శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. పెరిగిన స్టైఫండ్ 1.1.2023 నుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. కాగా ఎలాంటి సమ్మె లేకుండా ప్రభుత్వం స్టైఫండ్ పెంచడంపై రిమ్స్ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

శాస్త్రీయ కళల పరిరక్షణ అవసరం



వేంకటేశ్వర కల్యాణ ఘట్టాన్ని ప్రదర్శిస్తూ..

ఆదిలాబాద్: శాస్త్రీయ కళల పరిరక్షణ అవసరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీ వేంకటేశ్వర సంగీత నాట్య కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూచిపూడి, సంగీత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులు శాస్త్రీయ నృత్యంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర కల్యాణం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, నృత్య శిక్షకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలనే నిధులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో

ఆదిలాబాద్: క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతీ గ్రామంలో క్రీడా మైదానాలతో పాటు జిల్లా కేంద్రంలోని స్టేడియాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఈనెల 28 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల క్రీడాకారులు బయల్దేరారు. 18 విభాగాల్లో ఎంపికైన జట్లను శనివారం ప్రత్యేక బస్సుల్లో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్‌తో కలిసి జెండా ఊపి సాగనంపారు. అంతకు ముందుకు క్రీడాకారులను ఆయన శాలువాతో సత్కరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కేంద్ర ఆరోగ్యశాఖ అడ్వైజర్ బాలసుబ్రహ్మమణ్యం శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

మా భూములు మాకివ్వండి



ఫ్యాక్టరీ స్థలం వద్ద పోలీసులతో నిర్వాసితుల వాగ్వాదం



తన మనుమడిని, కుమారుడిని అరెస్టు చేయవద్దంటూ పోలీసును వేడుకుంటున్న వృద్ధురాలు

- రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ స్థలం వద్ద నిర్వాసితుల ఆందోళన
- పురుగుల మందు డబ్బాలతో తరలివచ్చిన ఆదివాసీలు
- దున్నేందుకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- రామాయి శివారు వద్ద ఉద్రిక్తత

ఆదిలాబాద్‌రూరల్: సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేంత వరకు తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలంటూ ఆదివాసీలు పోరుబాట పట్టారు. ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పిస్తామంటే నమ్మి భూములిచ్చామని, ఏళ్లు గడిచినా స్పందన లేకపోవడంతో తామంతా కూలీలుగా మారామంటూ ఆందోళనకు దిగారు. పురుగుల మందు డబ్బాలతో ఎడ్లబండ్లపై తరలివచ్చారు. తమ భూముల్లోకి అనుమతించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. భూమిని దున్నేందుకు యత్నించగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి శివారులోగల రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన స్థలం వద్ద నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారం ఉద్రిక్తతకు దారితీసింది.

అసలేం జరిగిందంటే..

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్, రామాయి, తదితర గ్రామాలకు చెందిన ఆదివాసీ రైతులు రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఐదేళ్ల క్రితం తమ భూములు ఇచ్చారు. మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన సంబంధిత యాజమాన్యం వారి నుంచి 107 ఎకరాలు సేకరించింది. ఐదేళ్లయినా ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఫ్యాక్టరీ నిర్మాణం అయ్యేంత వరకు తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలంటూ ఆదివాసీలు ఎడ్లబండ్లతో తరలివచ్చి ఆందోళనకు దిగారు. మహిళలు పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేసే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో మహిళలు పోలీసు వాహనంపై ఎక్కి నిరసన తెలిపారు. మా భూముల్లోకి మమ్మల్ని అనుమంతించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిని కిందకు దించేందకు యత్నించగా తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించారు. అరెస్టు చేసి పలు స్టేషన్లకు తరలించారు. పరిశ్రమ ఏర్పాటు విషయంలో మాట మార్చిన యాజమాన్యంపై చర్యలు చేపట్టకుండా భూములు త్యాగం చేసిన తమపై కేసులు ఏవిధంగా నమోదు చేస్తారని వారు ప్రశ్నించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. సర్కార్ స్పందించకపోతే తామే రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. కాగా, 22 మంది ఆందోళనకారులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

'నిరసన చేపడితే అరెస్టు చేస్తారా..'

ఆదిలాబాద్‌రూరల్: రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులు తమకు న్యాయం చేయాలంటూ శనివారం శాంతియుతంగా నిరసన చేపడితే పోలీసులు అరెస్టు చేయడం సరికాదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. బాధిత రైతులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మావల మండలం బట్టిసావర్‌గాం శివారు కుమురం భీం గూడలో శనివారం ఆయన మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని ఆదివాసీ రైతులు కోరగా.. కనీసం మహిళలని కూడా చూడకుండా పోలీసులు ప్రవర్తించిన తీరు సరికాదన్నారు.

ఫ్యాక్టరీ కోసం భూములిచ్చారు..
: సుహాసిని రెడ్డి

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి మాట్లాడుతూ, ఆదివాసీ రైతులు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇచ్చారు కాని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు కాదన్నారు. మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మాణం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి భూములను తీసుకొని క్షీరాభిషేకం చేసుకున్న ఎమ్మెల్యే జోగు రామన్న ఎందుకు స్పందించడం లేదన్నారు.

107 ఎకరాల భూమి కొనుగోలు చేశారు

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం 107 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. నిర్వాసితులకు ఎకరాకు రూ.9.25 లక్షల నుంచి రూ.9.75 లక్షల వరకు ఇచ్చారు. ఫ్యాక్టరీ నిర్మాణం అయితే వారి అర్హత బట్టి ఉద్యోగావకాశాలు వస్తాయి.

– శివరాజ్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాలే..



సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే నిర్వాసితులకు ఉద్యోగంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. ఇప్పటి వరకు పనులే ప్రారంభం కాలేదు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుంటేనే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

– కొడప సోనేరావు, కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే వెళ్లిపోతాం



సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చా. మూడేళ్లలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగంతో పాటు ఇల్లు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం ఎలాంటి నిర్మాణ పనులు జరగనందున మా భూమి మాకు ఇస్తే ఫ్యాక్టరీ పనులు ప్రారంభించినప్పుడు వారికి తిరిగి ఇచ్చేస్తాం. అప్పటి వరకు సాగు చేసుకుంటాం.

– కొట్నాక్ రాము, రాంపూర్

ఉపాధి పోయింది..



నాకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని సిమెంట్ ఫ్యాక్టరీ కోసం ఇచ్చా. భూమి లేకపోవడంతో పిల్లలు ఉపాధి లేక రోడ్లపై తిరుగుతున్నరు. ఇల్లు, ఉద్యోగం ఇస్తమని చెబితే నమ్మినం. ఇప్పుడేలా బతకాలే. కొన్న భూమినైనా తిరిగి ఇవ్వాలి. లేకుంటే ఫ్యాక్టరీ పనులు ప్రారంభించి ఉపాధినైనా కల్పించాలి.

– కొతుంబాయి, రాంపూర్, భూ నిర్వాసితురాలు

క్రమబద్ధీకరణ కసరత్తు



సమ్మెలో పాల్గొన్న వీఆర్‌ఏలు(ఫైల్)

- గ్రామాల వారీగా వీఆర్‌ఏల వివరాలు సేకరణ
- టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నియామకమైన వారికి ప్రాధాన్యత

జిల్లాలో..
రెవెన్యూ గ్రామాలు : 560
మంజూరైన వీఆర్‌ఏ పోస్టులు : 453
ప్రస్తుతం పని చేస్తున్న వీఆర్‌ఏలు : 386
టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నియామకమైనవారు: 48
వారసత్వంగా పని చేస్తున్న వారు : 348

కైలాస్‌నగర్: జిల్లాలో గ్రామ రెవెన్యూ సహాయకుల క్రమబద్ధీకరణ కసరత్తు మొదలైంది. రెవెన్యూశాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడంతో పాటు వారి విద్యార్హతల ఆధారంగా వ్యవసాయ, మున్సిపల్, మిషన్ భగీరథ, జెడ్పీ, విద్య, సాగునీటి పారుదల వంటి వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని రాష్ట్ర కేబినేట్ ఇటీవల నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు గ్రామాల వారీగా వీఆర్‌ఏల వివరాలను మూడు కేటగిరీలుగా నిర్దేశిత ఫార్మెట్‌లో సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియపై వీఆర్‌ఏల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మూడు విభాగాలుగా వివరాల సేకరణ..

అర్హులైన వీఆర్‌ఏలకు విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించడంతో పాటు 55 ఏళ్లు నిండిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా వీఆర్‌ఏల సమగ్ర సమాచారాన్ని పంపించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈమేరకు తహసీల్దార్లు తమ పరిధిలో గ్రామాల వారీగా పని చేసే వీఆర్‌ఏలు వారి విద్యార్హత, వయస్సు, నియామకమైన విధానం వంటి వివరాలు నిర్దేశిత ఫార్మెట్‌లో ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నియామకమైన వారికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో ఎంత మంది నియామకం అయ్యారు, వారి విద్యార్హతలు, ప్రస్తుతం వారు ఎక్కడ పని చేస్తున్నారనే వివరాలు నమోదు చేస్తున్నారు. రెండో ప్రాధాన్యతగా 2023 మే 15వ తేదీ నాటికి 55 ఏళ్లు నిండిన వారు ఎంత మంది ఉన్నారు, వారు కారుణ్య నియామకమా.. లేదా వారసత్వంగా ఉద్యోగాన్ని పొందారా అనే వివరాలు తెలుసుకుంటున్నారు. మూడో కేటగిరి కింద అనారోగ్యంతో బాధపడుతున్న వీఆర్‌ఏలు ఎంత మంది ఉన్నారు.. వారిలో పని చేస్తున్న వారు ఎంత మంది, వారికి బదులుగా కుటుంబీకులు, వారసులు ఎవరైనా పని చేస్తున్నారా అనే సమగ్ర సమాచారాన్ని నిర్దేశిత నమూనాలో సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అందిన సమాచారాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

రేపు గిరిజన సంస్కృతి పరిరక్షణ సమ్మేళనం

- ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు, చిత్రంలో పాయల్ శంకర్

ఆదిలాబాద్: మతం మారిన గిరిజనుల వల్ల నిజమైన గిరిజనులు పొందాల్సిన సౌకర్యాలు, హక్కులు 80 శాతం వరకు నష్టపోతున్నారని ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. ఆయన నివాసంలో శనివారం విలేకులతో మాట్లాడారు. మతం మారిన గిరిజనులను ఎస్టీ తెగల నుంచి తొలగించాలని, వారి వల్ల జరిగే నష్టాలను తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జనజాతి సురక్షా మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 29న పట్టణంలోని రాంలీలా మైదానంలో గిరిజన సంస్కృతి పరిరక్షణ సమ్మేళనం చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవహారంపై ఎంపీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తులు ఫ్యాక్టరీ పేరుతో ఆదివాసీల నుంచి వందల ఎకరాలను తక్కువ ధరకే తీసుకున్నారన్నారు. మూడేళ్లలో నిర్మాణం అని చెప్పి ఐదేళ్లు అవుతున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ విషయమై గతంలోనే నేషనల్ ఎస్టీ కమిషన్ రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములు ఇవ్వాలని ఆదేశించినా ఎలాంటి చర్యలు లేవన్నారు. తమ భూములను దున్నుకోవడానికి వెళ్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. భూములు రైతులకు ఇచ్చేంత వరకు బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

ప్రగతి ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు

- అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక జిల్లా సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. దశాబ్ది వేడుకల నిర్వహణపై స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూన్2 నుంచి 22 వరకు 21 రోజుల పాటు జరిగే వేడుకలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. రోజువారీగా జరిగే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు సాధించిందన్నారు. ముఖరా(కే) గ్రామానికి జాతీయ స్థాయిలో అవార్డు రావడం, జలశక్తి అభియాన్‌లో జిల్లా మూడో స్థానంలో నిలువడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరిగిన అభివృద్ధిని ఈ వేడుకల్లో భాగంగా ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి, వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై శాఖల వారీగా చర్చించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ట్రెయినీ సహాయ కలెక్టర్ వికాస్ మహతోను కలెక్టర్ అధికారులకు పరిచయం చేశారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, కదం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

'దశాబ్ది'కి సన్నద్ధం

- జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు
- జిల్లాకు రూ.మూడున్నర కోట్లు
- ఇప్పటికే రూ.ఒకటిన్నర కోట్లు విడుదల

సాక్షి,ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రణాళిక రూపొందించింది. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏటా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది. ఇందుకోసం ప్రభుత్వం అన్ని జిల్లాలకు నిధులు మంజూరు చేయగా, ఆదిలాబాద్ జిల్లాకు రూ.మూడున్నర కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.ఒకటిన్నర కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి.

జిల్లాలో ఇలా..

జూన్ 2న పతాక వందనంతో కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి దశా బ్ది ఉత్సవ సందేశం ఇవ్వనున్నారు. కార్యక్రమానికి ఎవరు వస్తారనేది త్వరలో స్పష్టం కానుంది. రైతు వేదికల్లో రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ రంగంలో సాధించిన విజయాలపై స్పష్టంగా తెలిసేలా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో జరిగిన సంస్కరణలు, వాటి విశిష్టతను సురక్ష దినోత్సవం సందర్భంగా సభ నిర్వహణ, కరపత్రాల పంపిణీ ద్వారా తెలియజేయనున్నారు. విద్యుత్ విజయోత్సవాల్లో భాగంగా రైతులు, వినియోగదారులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ రంగంలో సాధించిన గుణాత్మక మార్పును వివరించనున్నారు. పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో ఈ రంగంలో సాధించిన అభివృద్ధి గురించి తెలుపనున్నారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరించేలా ప్రతి నియోజకవర్గంలో సభలు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీల్లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల వద్ద పండగ నిర్వహించేలా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబార్‌లకు సంబంధించి లబ్దిదారులతో నియోజకవర్గ స్థాయిలో సభ నిర్వహించనున్నారు. సుపరిపాలనపై వివరించనున్నారు. మహిళ సంక్షేమం, సాహితీ దినోత్సవం, గిరిజనోత్సవం చేపట్టనున్నారు.. ఇలా వివిధ రంగాల ప్రజలతో మమేకమై ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజు 22న అమరుల సంస్మరణ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు.

ముస్తాబు..

దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌక్‌లతో పాటు జంక్షన్లను కూడా అందంగా ముస్తాబు చేయనున్నారు. మండలాలు, గ్రామాల్లోనూ వీటిని నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని ఈ కార్యక్రమాల్లో ప్రస్ఫుటం చేసేవిధంగా ఆయా వర్గాల ప్రజలను ఇందులో భాగస్వాములను చేస్తూ నిర్వహించనున్నారు.



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్

దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలు..

తేదీ	కార్యక్రమం
జూన్ 2న	ప్రారంభోత్సవ కార్యక్రమాలు
3న	రైతు దినోత్సవం
4న	సురక్ష దినోత్సవం
5న	విద్యుత్ విజయోత్సవం
6న	పారిశ్రామిక ప్రగతి ఉత్సవం
7న	సాగునీటి దినోత్సవం
8న	ఊరూరా చెరువుల పండగ
9న	సంక్షేమ సంబురాలు
10న	సుపరిపాలన దినోత్సవం
11న	సాహిత్య దినోత్సవం
12న	తెలంగాణ రన్
13న	మహిళా సంక్షేమ దినోత్సవం
14న	వైద్యారోగ్య దినోత్సవం
15న	పల్లె ప్రగతి దినోత్సవం
16న	పట్టణ ప్రగతి దినోత్సవం
17న	గిరిజనోత్సవం
18న	మంచినీళ్ల పండగ
19న	హరితోత్సవం
20న	విద్యాదినోత్సవం
21న	ఆధ్యాత్మిక దినోత్సవం
22న	అమరుల సంస్మరణ

క్లుప్తంగా

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

జైనథ్: మండలంలోని భోరజ్ గ్రామానికి చెందిన మంచికంటి శేఖర్ (37) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. శేఖర్ గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవలు జరిగేవి. భార్య, అతడి తల్లి ఎంత చెప్పినా వినకుండా తాగుతూనే ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తాగి వచ్చాడు. మత్తులో ఇంటి తలుపును గుద్దుకోవడంతో కంటి పైభాగంలో గాయమైంది. దీంతో భార్య, తల్లి మందలించడంతో ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. జీవితంపై విరక్తితో చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గాంధీఆస్పత్రిలో మండల వాసి మృతి


కుడిమెత మధు(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రాంజీగోండ్‌నగర్‌కు చెందిన కుడిమెత మధు మెదడులో రక్తం గడ్డకట్టడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఐదు రోజుల క్రితం ఆపరేషన్ చేయించినప్పటికీ శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీబాయి, ఇద్దరు సంతానం ఉన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య


ఆకం కృష్ణ (ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన అంకం కృష్ణ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణ స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. పంటకోసం అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టగా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలని తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘన్‌పూర్ గ్రామ సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న ప్రొఫెసర్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామాన్ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, యూనివర్సిటీ విద్యార్థులు అఖిల్, పావని, అనుష బృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతంలోని ప్రధాన మంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సర్పంచ్ పంద్రలత, ఏఈ ఇందల్, డీపీవో ఐటీడీఏ ప్రవీణ్ ఉన్నారు.

కాలంతో పోటీ.. అర్లి(టి)

- సీజనల్ స్పెషల్.. ఈ ఊరు
- ఏటా రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు
- శీతాకాలంలోనూ చలి అధికం
- భౌగోళిక పరిస్థితులే కారణం

సండే స్పెషల్

సాక్షి, ఆదిలాబాద్ డెస్క్: సీజనల్ స్పెషల్ ఈ ఊరు. జిల్లాలోనే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇది. వేసవిలో ఉష్ణోగ్రతలు.. శీతాకాలంలోనూ చలి అధికంగా నమోదు కావడం ఇక్కడి ప్రత్యేకత. ఓ సీజన్‌లో గజగజ వణికిస్తూ.. మరో సీజన్‌లో నిప్పుల కుంపటిని తలపించే ఆ ఊరే ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అర్లి(టి).


గ్రామంపై కప్పుకున్న పొగమంచు(ఫైల్)

భౌగోళిక అంశాలే..

భౌగోళికపరంగా ఈ గ్రామం సముద్రమట్టానికి 286 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది పూర్తిగా బండ ప్రాంతం. అలాగే ఓ వైపు అటవీ ప్రాంతం మరోవైపు ఎత్తైన ఐదు కొండలు పరుచుకుని ఉన్నాయి. వేసవిలో సూర్య ప్రభావంతో వేడెక్కిన గుట్టలతో ఉష్ణోగ్రత పెరిగి గరిష్ఠంగా నమోదవుతుంటుంది. ఇక చలికాలంలో శీతల గాలులు, మంచు ప్రభావం కొండల సరిహద్దుకే పరిమితం అవడంతో ఈ ప్రాంతంపై అధిక ప్రభావం చూపుతోంది. దీంతో స్థానికులను చలి వణికిస్తుం


చలిమంట కాగుతున్న వృద్ధురాలు(ఫైల్)

ది. అలాగే వర్షాకాలంలోనూ అటవీప్రాంతం, కొండల ప్రభావం, పెన్‌గంగా ప్రవాహం కారణంగా వర్షపాతం కూడా అధికంగానే నమోదవుతుంది.


వేసవిలో మండే ఎండ..


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా అర్లి(టి)

ఇక సమ్మర్‌లో ఉదయం ఏడు దాటిందంటే చాలు.. వేడి దడ పుట్టిస్తోంది. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు న మోదవుతుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే 45 డిగ్రీల మార్కుకు చేరువైంది. ఈ సీజన్‌లో చేను పనులు ఉదయం 5 నుంచి మొదలై 10 గంటలకు ముగుస్తా యి. మధ్యాహ్నం గ్రామస్తులు అంతా ఇళ్లలోనే గడుపుతారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తాయి. స్థానికులు చల్లదనం కోసం తొగరి కట్టెలతో పందిరి ఏర్పాటు చేసుకుంటారు.

చలికాలం.. మరో ఊటి

చలికాలం తీవ్రమైన చలి ఉంటుంది. సూర్యోదయ సమయంలో మంచుదుప్పటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పొగమంచు ప్రభావంతో ఈ ప్రాంతం చూపరులను కనువిందు చేస్తోంది. ఇక్కడ 2021లో రికార్డుస్థాయిలో 3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో స్థానిక బస్టాప్ వద్ద 24 గంటలు చలిమంటలు ఏర్పాటు చేస్తారు. ఈ సమయంలో ఆవులకు గోనె సంచులతో చేసిన దుస్తులు వేయడం ప్రత్యేకత. చలి నుంచి రక్షణ కోసం స్థానికులకు గొంగళ్లు పంపిణీ చేస్తుంటారు. వేకువజామున కొంచవల్లి దర్గా, రాముల గుట్ట నుంచి చూస్తే మంచుతెరలతో ప్రకృతి కనువిందు చేస్తోంది. డిసెంబర్‌లో ఒక వారంలో సూర్యుడు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే అస్తమిస్తాడు. రెండు, మూడు రోజులయితే భానుడు అసలే కనిపించడని స్థానికులు చెబుతుంటారు.


చలికాలంలో కమ్ముకున్న పొగమంచు


చలికాలంలో పశువులపై కప్పిన గన్నీ దుస్తులు (ఫైల్)

గ్రామంలో చలి, ఎండ ఎక్కువ..



మా ఊర్లో చలికాలంలో చలి, ఎండాకాలంలో ఎండ రికార్డుస్థాయిలో ఉంటది. వర్షం కూడా ఎక్కువే. వాతావరణం ఎలా ఉన్నా తట్టుకోవడం అలవాటు చేసుకున్నాం. చలి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటాం. చలిమంటల ద్వారా ఉపశమనం పొందుతాం. ఆవులకు గోనెసంచుల దుస్తులు వేస్తాం. ఇప్పుడైతే ఎండదంచి కొడుతుంది. ఇప్పటికే ఎండ 45 డిగ్రీలకు వచ్చిందటున్నరు.

– పిట్ల దేవారెడ్డి, అర్లి(టి) గ్రామం

చుట్టూ రాతి గుట్టల కారణంగానే..



అర్లి(టి)లో భిన్నమైన వాతావరణానికి భౌగోళిక పరిస్థితులే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రామం చుట్టూ ఎత్తైన రాతి గుట్టలు ఉన్నాయి. వేసవిలో ఎండల కారణంగా ఈ గుట్టలు వేడెక్కి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సమీపంలోనే పెన్‌గంగతో పాటు అటవీప్రాంతం ఉండడంతో శీతాకాలంలో చలిసైతం రికార్డుస్థాయిలో నమోదవుతుంది. వర్షపాతం కూడా అధికంగా ఉన్నందున రెయిన్‌గేజ్ ఏర్పాటు చేశాం.

– వెంకటరమణ, సీపీవో, ఆదిలాబాద్

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత


కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన బర్కం రాజశేఖర్ ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ ఆదేశాల మేరకు గాలింపులు చేపట్టిన పోలీసులు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంతంలో తిరుగుతున్న ఆ వ్యక్తిని పట్టుకున్నాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

నిర్మల్ జిల్లా వాసికి జ్యోతిష్యంలో డాక్టరేట్


డాక్టరేట్ పట్టాతో లక్ష్మణ్

తానూరు(ముధోల్): నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన లక్ష్మణ్ అప్పాకు జ్యోతిష్యంలో ఆస్ట్రాలజీ విభాగంలో డాక్టరేట్ దక్కింది. శనివారం తమిళనాడుకు చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టా ప్రదానం చేసినట్లు లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకృషికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాటాడుతున్న పలువురిని సీఐ షాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేష్ ఆధ్వర్యంలో దాడిచేసి శనివారం పట్టుకున్నారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

టైగర్‌జోన్ కార్యాలయం ఎదుట ముళ్లకంప

ఇచ్చోడ: టైగర్‌జోన్ పరిధిలో వ్యవసాయ పొలాల్లో బావులు, బోర్లు వేయనియకుండా ఆ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని శనివారం సిరిచెల్మలో టైగర్ జోన్ అటవీశాఖ కార్యాలయం ఎదుట ముళ్ల కంప వేసి రైతులు నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా సిరిచెల్మ టైగర్‌జోన్ పరిధిలోని వ్యవసాయ భూముల్లో అటవీశాఖ అధికారులు గిరిజన, గిరిజనేతర రైతుల భూముల్లో బావులు, బోర్లను వేయకుండా అడ్డుకుంటున్నారని నిరసిస్తూ కార్యాలయం ఎదుట అటవీశాఖ అధికారులు రాకుండా ముళ్ల కంప వేసి నిరసన తెలిపారు. పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులను అకారణంగా అధికారులు వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై టైగర్ జోన్ ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్‌ను వివరణ కోరగా టైగర్ జోన్ పరిధిలో కొంతమంది చట్ట విరుద్ధంగా బావులు, బోర్లు వేసుకుంటున్నారని, ఉన్నతశాఖ అధికారులు ఆదేశాల మేరకు అడ్డుకుంటున్నామని తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని కార్యాలయం ఎదుట ముళ్ల కంపను తొలగించారు.


కార్యాలయం ఎదుట ముళ్ల కంప వేసి నిరసన తెలుపుతున్న రైతులు

మాలీ కులస్తుల ఎస్టీ హోదాను రాజకీయం చేయవద్దు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: మాలీలది సామాజిక సమస్య అని, దానిని రాజకీయం చేయవద్దని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. గతంలో మాలీలకు ఇచ్చిన హామీ మేరకు మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మాలీ పటేళ్ల సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పటేళ్ల వ్యవస్థను పటిష్ఠం చేయబోతున్నామని కొంతమంది కుల ధృవీకరణ పత్రాలు, కల్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులు మాలీ సంఘ కులపెద్దల సంతకాలు ఫోర్జరీ చేసి, ఇతర వ్యక్తులు సంతకం చేసి లబ్ధి పొందుతున్నట్లు తెలిసిందన్నారు. జూన్ 5న కలెక్టర్, సంబంధిత తహసీల్దారులను కలిసి మాలీ కుల పెద్దల సంతకాలతో సంబంధించిన వినతి పత్రాలను అందించబోతున్నామన్నారు. కుల పెద్దలు పెట్టిన సంతకాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇతరులు చేసిన సంతకాలను రెవెన్యూ అధికారులు తిరస్కరించాలని కోరానున్నామని పేర్కొన్నారు. దీంతో మాలీ సంఘాన్ని పటిష్ఠం చేసి ఎస్టీ హోదా సాధించేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా రానున్న సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తూ గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ ఆమోదముద్ర వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం షిండే, జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, బరంపూర్(పటేల్) మహాజన్ గురునులే వినోద్, కుచలాపూర్ మహాజన్ శేండే విలాస్, రాంనగర్ మహాజన్ ప్రధాన్ శంకర్, యువజన సంఘాల నేతలు మాందాడే ఉత్తం, తాంసి మహాజన్ గంగారాం చౌదరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన


పనుల తీరును అడిగి తెలుసుకుంటున్న అధికారులు

బేల: రూ.1.56కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) అధికారులు సుబ్రమణ్యం, జాబిర్, భట్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. పనులు ఆలస్యం, నిర్మాణ గడువు, కాంట్రాక్టర్ అనుభవంపై ఆరా తీశారు. నిర్మాణంలో తక్కువ సిమెంట్, నాసిరకం సామగ్రి వినియోగించొద్దని ఆదేశించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, భవనం కనీసం 50ఏళ్ల భవిష్యత్ ఉండేలా చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతగా చేపట్టేలా ప్రతినిత్యం గమనించాలని సర్పంచ్ ఇంద్రశేఖర్‌ను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, ఠాక్రే మంగేష్ ఉన్నారు.

మల్లాపూర్ చెరువులో మొసళ్లు

- భయాందోళనలో గ్రామస్తులు
- మొసళ్లను పట్టేందుకు నీటిని దిగువకు వదులుతున్న గ్రామస్తులు


మల్లాపూర్ చెరువులో కనిపిస్తున్న మొసలి

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ ఊర చెరువులో రెండు మొసళ్లు కలకలం సృష్టించాయి. రెండు మొసళ్లు చెరువులో సంచరిస్తున్న విషయం తెలియడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రెండు మొసళ్లు చెరువులో సంచరిస్తూ కనిపించడంతో వెంటనే సర్పంచ్ రవి తహసీల్దార్ కవితారెడ్డికి సమాచారం అందజేశారు. దీంతో తహసీల్దార్, డెప్యూటీ ఎఫ్ఆర్వో నజీర్‌ఖాన్ చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. చెరువులో నీళ్లు ఎక్కువగా ఉండడంతో మొసళ్లను పట్టుకోవడం కష్టం అవుతుందని అటవీశాఖ అధికారులు తెలుపడంతో చెరువులోని నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువు నీటి మట్టం తగ్గిన తరువాత అందులోని మొసళ్లను పట్టుకొని గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44లోని పరమాత్మ జిన్నింగ్ మిల్లులో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ ఎస్ఎఫ్‌వో శివాజీ వివరాల ప్రకారం.. ఎండ తీవ్రతతో జిన్నింగ్ మిల్లులోని మిషనరీ బెల్ట్ వేడి కావడంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న పత్తికి అంటుకుంది. దీంతో సుమారు రూ.20వేల విలువ చేసే పత్తి దగ్ధమైనట్లు అంచనా. జిన్నింగ్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఫైర్ సిబ్బంది రవి, దేవేందర్, మధుకర్, తదితరులు ఉన్నారు.

గడువు ముగిసిన కంది విత్తనాలు సీజ్


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో రవీందర్

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలోని విత్తన దుకాణంలో గడువు ముగిసిన కంది విత్తనాలను మండల వ్యవసాయాధికారి రవీందర్ సీజ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సీడ్స్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా అర్లి షాప్‌లో నిల్వ చేసిన గడువు ముగిసిన కంది విత్తన సంచులను గుర్తించారు. 15ప్యాకెట్లలో 30కిలోల విత్తనాలను సీజ్ చేసినట్లు ఏవో తెలిపారు.

అండమాన్‌లో నిర్మల్ చిన్నారి నృత్యప్రదర్శన



మొమెంటో‌తో సత్కరిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శన ఇస్తున్న ప్రియదర్శిని

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ చెందిన పడిగెల నవనీత, శ్రీనివాస్ దంపతుల కుమార్తె పడిగెల ప్రియదర్శిని నృత్య ప్రదర్శనలో దూసుకుపోతోంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలు ఇచ్చిన ఈ చిన్నారి తాజాగా అండమాన్ నికోబార్ దీవుల్లో తన నృత్య ప్రదర్శనతో అలరించింది. అండమాన్ నికోబార్‌లోని వెంకటేశ్వర టెంపుల్‌లో నిర్వహిస్తున్న శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ప్రియదర్శిని భారతీయ నృత్య ప్రదర్శనలను చేసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రియదర్శినిని ఘనంగా సన్మానించారు.

అమ్మవారి సన్నిధిలో 'మహా' నేతలు



భైంసా(ముధోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం మహారాష్ట్రకు చెందిన పలువురు నేతలు దర్శించుకున్నారు. మహారాష్ట్ర సీఎం వ్యక్తిగత సహాయకులు బాలాజీ ఖద్గాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు రామారావు పటేల్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.